AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
6-9-2025 (Saturday)
MAIN EDITION

## బిగ్‌బాస్ సీజన్ 9 రేపటి నుంచే..




**అక్షరటుడే, సినిమా డెస్క్:** ప్రముఖ రియాలిటీ షో బిగ్‌బాస్ తెలుగు సీజన్ 9 ప్రారంభానికి ఇక మరికొన్ని గంటలే మిగిలి ఉంది. ఆదివారం రాత్రి 7 గంటలకు ఈ సీజన్ గ్రాండ్‌గా ప్రారంభంకానుంది. కాగా.. మరోసారి కింగ్ నాగార్జున హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. ఇప్పటికే షోపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కాగా.. ఇప్పటి వరకూ బిగ్‌బాస్ హౌస్‌లో సెలబ్రిటీలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుండగా.. ఈ సీజన్‌లో కామన్ మెన్‌కు కూడా చోటు లభించింది. 'కామనర్స్ వర్సెస్ సెలబ్రిటీలు' అనే కాన్సెప్ట్‌తో సీజన్ 9 ముందుకు సాగనుంది. మొత్తం 15 మంది కంటెస్టెంట్లు పాల్గొననున్న ఈ సీజన్‌లో 9 మంది సెలబ్రిటీలు, ఆరుగురు సామాన్యులు ఉండనున్నారు.

**భారత్ దూసుకుపోతోంది. అనేక సవాళ్లు, సంక్షోభాల నడుమ జోరు కొనసాగిస్తోంది. ఆర్థిక, వ్యాపార, వాణిజ్య, శాస్త్ర సాంకేతిక రంగాల్లో చారిత్రక విజయాలు సాధిస్తోంది. విదేశాంగ విధానంలో సరికొత్త వైఖరితో దూకుడు ప్రదర్శిస్తోంది. పశ్చిమ దేశాలకు దీటుగా నిలవడమే కాదు, ప్రపంచ పెద్దన్న అమెరికా ఆధిపత్యాన్ని సైతం సవాల్ చేస్తోంది. సుంకాలు, ఆంక్షల బెదిరింపులను తిప్పికొడుతూ ప్రపంచ వేదికపై భారత్ తన శక్తిని ప్రదర్శిస్తోంది. ప్రపంచంలో అమెరికా తర్వాత అత్యంత శక్తివంతమైన దేశాలు రష్యా, చైనాలతో బంధాన్ని బలోపేతం చేసుకోవడం ద్వారా అగ్రరాజ్య ఆధిపత్యానికి గండి కొడుతోంది. అన్ని రంగాల్లో అత్యంత శక్తివంతంగా ఎదిగిన భారత్ ఇప్పుడు భౌగోళిక రాజకీయ, ఆర్థిక రంగంపై పెను ప్రభావం చూపే స్థాయికి చేరింది. 50 శాతం సుంకాలు చాలా ఎక్కువని అంగీకరించిన అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్‌తో సంబంధాల పునరుద్ధరణకు సిద్ధంగా ఉన్నామని తాజాగా పేర్కొనడమే ఇండియా దౌత్య నీతికి దక్కిన మరో విజయం.**

—అక్షరటుడే, ఢిల్లీ ప్రతినిధి





# మోదీ దెబ్బకు.. దిగొచ్చిన ట్రంప్ మామ

### ఆర్థిక వృద్ధిలో భారత్ జోరు

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలో ఉంటే మన ఆర్థిక వ్యవస్థ మాత్రం దూసుకుపోతోంది. అంచనాలను మించి వృద్ధి రేటు వేగంగా పెరుగుతోంది. గత ఏప్రిల్ నుంచి జూన్ త్రైమాసికంలో 7.8 శాతం జీడీపీ వృద్ధి రేటును నమోదు చేసుకుంది. మరోవైపు, 3.36 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగింది. డాలర్ మారక ద్రవ్య విలువల బట్టి చూసినా, భారత్ 691.87 బిలియన్ డాలర్ల జీడీపీతో ప్రపంచంలో పదో స్థానంలో ఉంది.

ఈ ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 7.8 శాతంగా ఉండొచ్చని రిజర్వ్‌బ్యాంక్ అంచనా వేయడం విశేషం.. మోదీ ప్రభుత్వ సంస్కరణలు.. అనుసరిస్తున్న విధానాలతో గతంలో ఎన్నడూ లేని విధంగా పెట్టుబడులు సైతం పెరిగాయి. సుస్థిర ఆర్థికాభివృద్ధి, అసమానతల తగ్గింపు, పేదరిక నిర్మూలన కొరకు ఆర్థిక సమ్మిళితంపై దృష్టి పెట్టిన ప్రభుత్వం ఆ దిశగా అనేక విజయాలు సాధిస్తోంది. మన మార్కెట్లు బలమైన పనితీరు కనబరుస్తుండడం ఆర్థిక వృద్ధి రేటును ప్రతిబింబిస్తోంది. మూలధన సృష్టిలో ప్రాథమిక మార్కెట్లు 2023 ఆర్థిక ఏడాదిలో రూ.9.3 లక్షల కోట్లు కాగా, 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.10.9 లక్షల కోట్లు సృష్టించడం విశేషం.

- ఒత్తిళ్లను తట్టుకుని.. సవాళ్లను అధిగమించి..
- పశ్చిమ దేశాలు, యూఎస్‌కు దీటుగా నిలుస్తున్న ఇండియా
- మారిన భారత విదేశాంగ విధానం
- ప్రపంచ పెద్దన్నను సవాల్ చేస్తున్న భారత్
- మోదీ వ్యూహాత్మక నిర్ణయాలతో పునరాలోచనలో ట్రంప్

ఇండియా గతంలో ఎన్నడూ లేని రీతిలో అత్యంత శక్తివంతంగా ఎదిగింది. ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయికి చేరింది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపే శక్తి ప్రధాని నరేంద్ర మోదీకి మాత్రమే ఉందని ప్రపంచ దేశాలన్నీ అభిప్రాయం వ్యక్తం చేశాయంటేనే భారత్ ఏ విధంగా శాసించే స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. అన్ని రంగాల్లో స్వావలంబన సాధించడం, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో స్వయం ప్రతిపత్తి సాధించడమే మనల్ని ప్రపంచ దేశాల సరసన నిలబెట్టింది. 'ఆత్మ నిర్భర్ భారత్', 'మేక్ ఇన్ ఇండియా', 'డిజిటల్ ఇండియా' వంటి కార్యక్రమాలు అంతర్గత అభివృద్ధికి ఊతమిచ్చాయి. రక్షణ రంగంలో ఒకనాడు దిగుమతి చేసుకునే స్థాయి నుంచి నుంచి నేడు ఎగుమతి చేసే స్థాయికి చేరింది. ఐఎన్ఎస్ విక్రాంత్ వంటి సొంత ఉత్పత్తులు, యుద్ధ ట్యాంకులు, జెట్లు భారత్‌లో తయారీ చేయడమే కాదు, అధునాతన క్షిపణులు, రక్షణ వ్యవస్థలను సైతం విదేశాలకు ఎగుమతి చేస్తోంది.

### ట్రంప్ దిగిరాక తప్పని పరిస్థితి..

ఆర్థిక, సైనిక, వ్యాపార, వాణిజ్య, శాస్త్ర సాంకేతిక రంగాల్లోనే కాదు.. అన్నింటా దూసుకుపోతున్న భారత్‌పై సహజంగానే అమెరికా సహా పశ్చిమ దేశాలకు కంటగింపుగా మారింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉన్నప్పటికీ భారత్ ఆర్థిక వృద్ధి పురోగమిస్తుండడాన్ని జీర్ణించుకోలేక అక్కసు వెళ్లగక్కుతున్నాయి. మరోవైపు ప్రపంచ దేశాలను గుప్పిట్లో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న డొనాల్డ్ ట్రంప్ సుంకాలను ఆయుధంగా మార్చుకున్నారు. వివిధ దేశాలపై టారిఫ్‌లు విధించి తన దారికి తెచ్చుకుంటున్నారు. అయితే, భారత్ మాత్రం ట్రంప్‌నకు సవాల్ విసురుతోంది. సుంకాలపై అనేక దేశాల అధిపతులు తనతో రాయబారం నడుపుతుంటే, ఇండియా మాత్రం లైట్‌గా తీసుకుంది. పైగా ట్రంప్ తానే స్వయంగా నాలుగుసార్లు ఫోన్ చేసినా ప్రధాని మోదీ కనీసం లిఫ్ట్ కూడా చేయలేదు. తద్వారా అమెరికా ఒత్తిళ్లను తాము పట్టించుకోబోమనే సందేశం ఇచ్చారు. సుంకాల బాధిత దేశంగా మారిన ఇండియాకు ఇప్పుడు విశ్వవ్యాప్తంగా మద్దతు లభిస్తోంది. టారిఫ్ యుద్ధాన్ని దీటుగా ఎదుర్కొంటున్న భారత్‌కు అగ్రరాజ్యంలోనే పుష్కలంగా మద్దతు లభిస్తుండడం ట్రంప్‌నకు చికాకు పుట్టిస్తోంది. ఎన్ని రకాలుగా ఒత్తిళ్లు, బెదిరింపులకు దిగినా.. దిగిరాని భారత్‌ను చూసి ఆయనలో కోపం కట్టలు తెంచుకుంటోంది. భారత దౌత్య వ్యూహాలతో చివరకు దిగిరాక తప్పని పరిస్థితి ఏర్పడింది.

### ఎదురుతిరుగడమే అసలైన వ్యూహం

ఒకప్పుడు భారత్‌పై పలు దేశాలు అనేక రకాలుగా ఒత్తిళ్లు పెట్టి ఏదో విధంగా పైచేయి సాధించాయి. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ఒత్తిళ్లు, ఆంక్షలు, బెదిరింపులకు వెరువకుండా ఎదురుతిరగడం, దెబ్బ తీయడమే ఇండియా విధానంగా మారింది. పాకిస్తాన్, మాల్దీవులు, మలేషియా, కెనడా, అమెరికా సహా.. అది ఏ దేశమైనా సరే భారత్ మాత్రం వెనుకడుగు వేయకుండా దౌత్య వ్యూహాలతో ఆయా దేశాలకు చెక్ పెడుతోంది. పాకిస్తాన్, చైనా అండతో ఎదురుతిరిగిన మాల్దీవులకు మోదీ కొట్టిన దెబ్బ గట్టిగానే తగిలింది. పర్యాటక రంగంపై ఆధారపడి బతుకుతున్న ఆ దేశానికి భారత పర్యాటకులే ఊపిరి పోస్తున్నారు. దీన్నే ఆయుధంగా మార్చిన మోదీ.. లక్ష్యద్వీప్‌లో పర్యటించి.. అక్కడ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో 'బాయ్‌కాట్ మాల్దీవులు' ప్రచారం ఊపందుకుంది. టూరిస్టులు తగ్గిపోయి, ఆదాయం పడిపోవడంతో మాల్దీవులు మన దారికి వచ్చింది. ఇలాంటి ఉదంతాలెన్నో ఉన్నాయి. సైనికంగా ఎంతో బలమైన చైనాకు కూడా దీటుగా నిలిచింది. గల్వాన్ లోయలోకి చొచ్చుకొచ్చేందుకు యత్నించిన చైనా సైన్యాన్ని దీటుగా ఎదుర్కొంది. అంతకు ముందు డోక్లాంలో ఎన్ని బెదిరింపులకు పాల్పడినా చలించకపోవడంతో చైనానే వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఉగ్రవాదులతో తరచూ దాడులకు తెగబడుతున్న పాకిస్తాన్‌కు భారత్ గట్టి పాఠమే చెప్పింది. సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్‌తో దాయాది కాళ్లబేరానికి రాక తప్పలేదు.




## గంగమ్మ ఒడికి.. గణపయ్య..

**రాష్ట్ర వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా హైదరాబాద్ నగరంలో శనివారం ఉదయం నుంచే భక్తులు గణనాథుడి విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు. భారీ గణేశుడి విగ్రహాలతో శోభాయాత్ర కనులపండువగా సాగుతోంది. భక్తులతో హుస్సేన్ సాగర్ ప్రాంతం కోలహలంగా మారింది. లక్షలాది మంది భక్తులు నిమజ్జనాన్ని తిలకించేందుకు వచ్చారు. ఖైరతాబాద్ బడా గణేశుడిని ఎన్టీఆర్ మార్గ్‌లోని నాలుగో నంబర్ క్రేన్ వద్ద నిమజ్జనం చేశారు. కాగా.. నిమజ్జన ఏర్పాట్లను సీఎం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు పలు సూచనలు చేశారు.**

-అక్షరటుడే, హైదరాబాద్

## జలదిగ్బంధంలోనే ఏడుపాయల ఆలయం



**అక్షరటుడే, మెదక్:** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా మాత ఆలయం ఇంకా జలదిగ్బంధంలోనే ఉంది. మంజీర ఉధృతంగా పారుతుండడంతో అధికారులు ఆలయాన్ని మూసి ఉంచారు. ఎగువన కురుస్తున్న వర్షాలతో సింగూరుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సింగూరు జలాశయంలో ఎక్కువ మొత్తంలో నీరు నిల్వ చేయవద్దని ఎన్‌డీఎస్‌ఏ అధికారులు సూచించారు. దీంతో ప్రాజెక్ట్ అధికారులు నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం రెండు గేట్ల ద్వారా మంజీరలోకి నీటిని విడుదల చేస్తున్నారు. సింగూరు నుంచి వచ్చిన నీటితో ఏడుపాయలలోని ఘనపురం ఆనకట్టపై నుంచి వరద నీరు పొంగి పొర్లుతోంది. ఆలయం ఎదుట నుంచి మంజీర ఉధృతంగా పారుతోంది. దీంతో అధికారులు ఆలయాన్ని మూసి ఉంచారు. 24 రోజులుగా అమ్మవారి ఆలయం మూసి ఉంది. కాగా.. రాజగోపురంలో ఉత్సవ విగ్రహానికి పూజలు చేస్తున్నారు.

## కవిత వ్యాఖ్యలపై స్పందించిన హరీశ్‌రావు




**అక్షరటుడే, హైదరాబాద్ :** జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు. ఆయన తీరుపై ఇటీవల కవిత తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. కాళేశ్వరం అవినీతిలో హరీశ్‌రావు పాత్ర ఉందని ఆమె ఆరోపించారు. అంతేగాకుండా గజ్వేల్ , కామారెడ్డిలో కేసీఆర్ ఓటమికి ఆయన ప్రయత్నాలు చేశారన్నారు. నిజామాబాద్ ఎంపీగా తనను ఓడించడానికి ఎమ్మెల్యేలతో కుట్ర పన్నారని కవిత ఆరోపించిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ పార్టీ నుంచి తనను సస్పెండ్ చేయించడానికి హరీశ్‌రావు, సంతోష్‌రావు కారణమని ఆరోపణలు చేశారు. వారు బీఆర్ఎస్‌ను హస్తగతం చేసుకోవడానికి కుట్ర చేస్తున్నారని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అయితే ఆమె ఆరోపణలు చేసిన సమయంలో హరీశ్‌రావు లండన్‌లో ఉన్నారు. శనివారం ఉదయం హైదరాబాద్ రాగా.. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఆయన కవిత వ్యాఖ్యలపై స్పందించారు.

### నా జీవితం తెరిచిన పుస్తకం

తెలంగాణ ఉద్యమం నుంచి తన జీవితం తెరిచిన పుస్తకం అని హరీశ్ రావు అన్నారు. ఇటీవల తనతో పాటు పార్టీపై కొందరు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇతర పార్టీల నేతలు చేస్తున్న ఆరోపణలనే కవిత చేశారని ఆయన అన్నారు. అయితే అవి ఎందుకు చేశారో, ఎవరి లబ్ధికోసం చేశారో ఆమె విజ్ఞతకే వదిలి వేస్తున్నానని హరీశ్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర పోరాటంలో తన నిబద్ధత అందరికీ తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. అనంతరం నేరుగా ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌కు వెళ్లి కేసీఆర్‌తో భేటీ అయ్యారు. పార్టీలోని పరిణామాలపై చర్చించారు.

## హైదరాబాద్‌లో వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ కేంద్రంగా డ్రగ్స్ తయారు చేస్తున్న ఓ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్ర, తెలంగాణ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నగరంలోని చర్లపల్లి పారిశ్రామిక వాడలో కొందరు నిషేధిత డ్రగ్స్ తయారు చేస్తున్నారు. ఓ కెమికల్ ఫ్యాక్టరీలో ఎండీ (మెఫెడ్రోన్) అనే డ్రగ్ ఉత్పత్తి చేస్తున్నారు. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన పోలీసులు ఫ్యాక్టరీపై దాడులు చేశారు. ఇందులో రూ.12 వేల కోట్ల విలువైన నిషేధిత మాదకద్రవ్యాలను పట్టుకున్నారు. దేశంలోనే వీరిది పెద్ద డ్రగ్ నెట్‌వర్క్‌గా భావిస్తున్నారు. హైదరాబాద్ కేంద్రంగా వీటిని తయారు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గుర్తించారు. మహారాష్ట్రలోని మీరా రోడ్ పోలీసులు డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించారు. 32 వేల లీటర్ల లిక్విడ్‌లు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.12 వేల కోట్ల వరకు ఉంటుందని సమాచారం. ఈ ఆపరేషన్‌లో మొత్తం 13 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు సమాచారం.



### రహస్య ఆపరేషన్

మహారాష్ట్ర పోలీసులు మొదట దాడులు చేపట్టి 200 గ్రాముల ఎండీ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.25 లక్షలు. అనంతరం వారు ఈ కేసులో లోతుగా దర్యాప్తు చేపట్టడంతో భారీ డ్రగ్స్ రాకెట్ వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు ముఠాలోకి తమ గూఢచారులను పంపించారు. కొన్ని రోజుల పాటు స్పెషల్ ఆపరేషన్ చేపట్టి డ్రగ్స్ ఎక్కడ తయారు చేస్తున్నారో గుర్తించారు. అనంతరం చర్లపల్లిలోని ఫ్యాక్టరీపై దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

## 15న తెలంగాణకు కాంగ్రెస్ అగ్రనేతలు

**అక్షరటుడే, కామారెడ్డి:** గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీ నినాదాన్ని ఎత్తుకుంది. అధికారంలోకి వస్తే 42 శాతం బీసీలకు రిజర్వేషన్ అమలు చేస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో వెల్లడించింది. అధికారంలోకి వచ్చాక బీసీ రిజర్వేషన్‌పై అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్ ఆమోదం కోసం పంపించింది. ఒకవేళ గవర్నర్ ఆమోదం పొందకపోతే పార్టీ పరంగా 42 శాతం టికెట్స్ ఇచ్చి ఎన్నికలకు వెళ్లేలా ప్రణాళికతో సిద్ధంగా ఉంది. ఈ క్రమంలో బహిరంగ సభ ఏర్పాటు చేసి సంబరాలు నిర్వహించాలని కాంగ్రెస్ అధినాయకత్వం ఆలోచిస్తోంది. ఈ నేపథ్యంలోనే కామారెడ్డి పట్టణంలో ఈ నెల 15న బీసీ డిక్లరేషన్ సంబరాలు నిర్వహించనుంది. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలు పెట్టుకున్న నమ్మకం నిలుపుకుందన్నారు. సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్, తెలంగాణ, కర్ణాటక సీఎంలు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య ఇతర ముఖ్యనేతలు పాల్గొననున్నారు.

## 'పవర్‌గ్రిడ్'లో ఉద్యోగావకాశాలు




**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** ఫీల్డ్ ఇంజినీర్, సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ కోసం పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం 1,543 పోస్టులను భర్తీ చేయనుంది. సంస్థ వెబ్‌సైట్‌లో పరీక్ష, ఇంటర్వ్యూ తేదీలను ప్రకటిస్తారు. పూర్తి వివరాలు, దరఖాస్తు ప్రక్రియ కోసం సంస్థ అధికారిక వెబ్‌సైట్ https://www.powergrid.in/ను సంప్రదించండి.

**దరఖాస్తుకు చివరి తేదీ :** సెప్టెంబర్ 17.

**ఎంపిక విధానం :** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తారు.

**పరీక్ష కేంద్రాలు :** ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, భోపాల్, కోల్‌కతా, గువహటి.

## ఎర్రకోటలో భారీ చోరీ..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** దేశ రాజధాని ఢిల్లీలో గల ఎర్రకోటలో దొంగలు పడ్డారు. పటిష్ట భద్రత ఉండే కోటలో రూ.కోటి విలువైన కలశాలను ఎత్తుకెళ్లారు. కోట ప్రాంగణంలో వ్యాపారవేత్త సుధీర్ జైన్ దసలక్షణ మహాపర్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 9 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ పూజా క్రతువులో వినియోగించడానికి తీసుకొచ్చిన కలశాలను ఓ వ్యక్తి ఎత్తుకెళ్లాడు. ఈ ఘటన సెప్టెంబర్ 3న చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పూజల కోసం వ్యాపారవేత్త సుధీర్ జైన్ 760 గ్రాముల బంగారు కలశం, బంగారు కొబ్బరికాయ, వజ్రాలు, మాణిక్యాలతో పొదిగిన 115 గ్రాముల మరో బంగారు కలశం తీసుకొచ్చారు. అయితే జైన పూజారి వేషంలో వచ్చిన ఓ వ్యక్తి వాటిని సంచిలో వేసుకొని మెల్లిగా అక్కడి నుంచి జారుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.